క్లుప్తంగా

కార్యదర్శులకు శిక్షణ తరగతులు



కాటారం : మండల పంచాయతీ అధికారి వీరస్వామి మండలంలో ల్యాండ్ రెగ్యులేషన్ సర్వే (ఎల్ఆర్ఎస్)పై బుధవారం పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఫీల్డ్‌లో మెకాపై చేయాల్సిన సర్వేపై ప్రాక్టికల్ శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఇంజనీర్ రాజేష్, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'గుడిసెలు ఖాళీ చేయించడం హేయం'

ములుగు రూరల్ : మండలంలోని ఇంచర్ల శివారులోని అంబేడ్కర్ నగర్‌లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలను ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేయడం హేయమైన చర్య అని తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు బానోతు నర్సింహ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించి గుడిసెలు ఖాళీ చేయించాలని అన్నారు. లేని పక్షంలో రైతు కూలీసంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

బదిలీ అధికారికి వీడ్కోలు

ములుగు రూరల్: మండలంలో 11 ఏళ్లుగా మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహించి రైతుల మన్ననలు పొందిన మునుకుంట్ల సంతోష్‌ను రైతులు ఘనంగా సన్మానించారు. బుధవారం మండలంలోని పత్తిపల్లి రైతు వేదికలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌ను, మండలంలో నూతనంగా వచ్చిన మండల వ్యవసాయ అధికారి పరమేశ్వర్‌ను సన్మానించారు. రైతు అంజిరెడ్డి మాట్లాడుతూ మండల రైతులకు సుదీర్ఘ కాలం సేవలందించి రైతులకు పంటల సాగు సలహాలు సూచనలు అందించిన సంతోష్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పులిగుండం, పొట్లాపూర్, దేవగిరిపట్నం రైతులు సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి, భవసింగ్, కుమారస్వామి, విష్ణు, రాంచందర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ములుగు రూరల్ : మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన సాయబోయిన సాంబయ్య పాముకాటుకు గురై మృతి చెందగా ఆయన కుటుంబాన్ని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి పరామర్శించారు. బుధవారం సాంబయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ. 5 వేల ఆర్థికసాయం అందించారు. ఆమె వెంట నాయకులు ఉయ్యాల రాజయ్య, కుమారస్వామి, వేములపల్లి భిక్షపతి, గండి కుమార్, చంద్రమౌళి, ప్రభాకర్, గొర్రె సమ్మయ్య, విజయరాంనాయక్, భద్రయ్య, నాజర్‌ఖాన్ ఉన్నారు.

వైద్యశాలలో బతుకమ్మ వేడుకలు

వెంకటాపురం(కె) : మండలంలోని ఎదిర ప్రభుత్వ వైద్యశాలలో వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో బుధవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, సిబ్బంది బతుకమ్మలను పేర్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నేహా, వినయ్, ఆశిష్, సిబ్బంది జ్యోతి, మనోహర్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ములుగు రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని పత్తిపల్లిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించగా ఇమినేషన్ అధికారి డాక్టర్ రణధీర్, ఏఎంఓ దుర్గారావు సబ్‌యూనిట్ ఆఫీసర్ సాంబయ్యలు సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు.

అధ్వానంగా కాల్వలు



పిచ్చి మొక్కలతో నిండిన ఎస్సారెస్పీ డీబీఎం-38 కాల్వ



కాల్వలో మొలిచిన చెట్లు, పిచ్చిమొక్కలు (ఇన్‌సెట్‌లో) కాల్వలో కోళ్ల వ్యర్థాలు

- పూడిక, ముళ్ల కంపలతో డీబీఎం- 38 కాల్వ
- సాగునీటి సరఫరాకు ఆటంకం
- కాల్వలోనే కోళ్ల వ్యర్థాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

రేగొండ : పంటలకు సాగునీరందించే ఎస్సారెస్పీ డీబీఎం-38 కాల్వ, ఉపకాల్వలు అధ్వానంగా మారాయి. పూర్తిగా పిచ్చిమొక్కలు, చెట్లతో నిండిపోయి చిట్టడవి మాదిరిగా తయారైంది. దీంతో నీరు ప్రవహించేందుకు వీలులేకుండా కాల్వలు తయారయ్యాయి. పంటలకు సాగునీరు అందించేందుకు ఎస్సారెస్పీ కాల్వలే ఆధారం. దీనిపై ఆధారపడి సాగు చేసిన వరిపంట చివరి దశకు చేరుకుంది. కానీ ప్రస్తుతం ఎస్సారెస్పీ కాల్వలు పిచ్చిమొక్కలతో నిండిపోయింది. పలు చోట్ల సిమెంట్ లైనింగ్ శిథిలమైంది. మండల కేంద్రంలోని గ్రామస్తులు చెత్తను కాల్వలో వేస్తున్నారు. మరికొందరు చికెన్ వ్యాపారులు కోళ్ల వ్యర్థాలను కూడా కాల్వలోనే పడేస్తున్నారు. భాగిర్థిపేట, తిరుమలగిరి తదితర ప్రాంతాల్లో వ్యర్థాలతో పాటు గట్లకు ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదల కొమ్మలు కూడా పలుచోట్ల కాల్వలను మూసేస్తున్నాయి.

కాల్వపైనే ఆధారం

మండలంతో పాటు చిట్యాల, టేకుమట్ల మండలాల్లోని వివిధ గ్రామాల రైతులు సాగునీటి అవసరాలకు డీబీఎం-38 కాలువ పైనే ఆధారపడుతారు. ఈ కాల్వ కింద ఉపకాల్వలు, చెరువులు ఉన్నాయి. దీని పరిధిలో ఎక్కువగా వరిపంట సాగు చేస్తారు. ఈ నేపథ్యంలో కాల్వల్లో నీరు పారలేని విధంగా మారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పిచ్చిమొక్కలు తొలగించాలి



మండలంలోని ప్రధాన కాల్వ డీబీఎం-38తో పాటు దాని అనుబంధ ఉపకాల్వలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. నీరు ప్రవహించకుండా మారాయి. దీంతో సాగునీటికి ఇబ్బందులు ఏర్పడతాయి. అధికారులు స్పందించి కాల్వలను శుభ్రం చేయించే చర్యలు చేపట్టాలి.

- సాదు దేవేందర్, రైతు

మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ



చేప పిల్లలను అందిస్తున్న అధికారులు

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి, కలికోట, వెంకట్రావుపల్లి, పంగిడిపల్లి, వెలిశాల, రామకిష్టాపూర్(వి), ఎంపేడు గ్రామాల మత్స్యకారులకు బుధవారం తహసీల్దార్ విజయలక్ష్మీ, ఎంపీడీవోట అనిత చేతుల మీదుగా మత్స్య శాఖ భూపాలపల్లి జిల్లా 2024-25 సంవత్సరానికి గానూ 100 శాతం రాయితీతో రూ.10 లక్షల విలువైన చేప పిల్లలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. మండలంలోని మత్స్యకారులు చెరువుల్లో చేపలను పెంచుకుని ఉపాధితో పాటు, ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్, సొసైటీ అధ్యక్షుడు ఊటిపెల్లి సమ్మయ్య, మత్స్యకారులు నరెడ్ల సమ్మయ్య, అనవేని మొగిళి, శంకర్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

జనాలతో సందడే.. సందడి



జనాలతో కిక్కిరిసిన మండల కేంద్రం

టేకుమట్ల : సద్దుల బతుకమ్మ, దసరా పండగ సందర్భంగా బుధవారం మండల కేంద్రం సందడే సందడిగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జనాలతో సందడిగా మారింది. మండలంలోని అన్ని గ్రామాలతో పాటు, మొగుళ్లపల్లి, చిట్యాల మండలాల ప్రజలు సైతం మండల కేంద్రంలో పండుగ షాపింగ్ చేస్తుండడంతో బిజీబిజీగా మారింది. మండల కేంద్రం నుంచి రాఘవరెడ్డిపేట, అంకుషాపూర్, ఆశిరెడ్డిపల్లి, చిట్యాల ప్రధాన రోడ్ల వెంట జనాలతో నిండుకుంది. దసరా పండగ వేళ వ్యాపారపరంగా సంతృప్తి ఉందని వ్యాపారస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల్లో దేశభక్తిని పెంపొందించాలి



పద సంచాలన చేస్తున్న ఆర్ఎస్ఎస్ సేవకులు

చిట్యాల: ప్రజలలో దేశభక్తిని చాటి హిందూ ధర్మం పట్ల సేవాభావాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని ఆర్ఎస్ఎస్ వరంగల్ విభాగ్ సంఘ్ చాలక్ చిలుకమారి సంజీవ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పలువీధుల గుండా తిరుగుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చిట్యాల ఖండ పదసంచలన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉన్నత పాఠశాల ఆవరణలో విజయదశమి ఉత్సవాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ అనేది వందేళ్ల క్రితం ఏర్పడిందన్నారు. విజయదశమి ఉత్సవాన్ని పురస్కరించుకుని మహారాష్ట్రలోని నాగపూర్‌లో డాక్టర్ కేశవరావు ప్రారంభించారని తెలిపారు. అప్పటి నుంచి మన దేశంలో 65వేల గ్రామాల్లో సంఘ శాఖలు నడుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి రోజు ఒకగంట సమయం తీసుకుని సంఘశాఖ ద్వారా ప్రజల్లో దేశభక్తి, హిందూధర్మం పట్ల సేవాభావాన్ని పెంచేలా అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవర్గ బుర్ర సదయ్య, ఖండ సంచాలకులు కనుకుల లక్ష్మారెడ్డి, ఖండ సహ కార్యవాహ శ్రీరాం రఘుపతి, గడ్డం వెంకటేష్, సాయికిరణ్, మధుకర్, సురేష్, శ్రీనివాస్, వినయ్, బుర్ర వెంకటేశ్వర్లు, గుండ మణికుమార్, వేల్పుల రాజ్‌కుమార్, చిలుముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'విందుల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నాం'

భూపాలపల్లి అర్బన్ : సింగరేణి కార్మికులకు యాజమాన్యం ఇవ్వాలనుకునే విందులను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి కంపేటి రాజయ్య తెలిపారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా కార్మికులకు, కుటుంబ సభ్యులకు స్థానిక నాయకుల ద్వారా సింగరేణి యాజమాన్యం విందులను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ జోక్యం చేసుకోవాలని చూస్తుందన్నారు. సింగరేణికి ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు చెల్లించిన తర్వాత కార్మికులు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయడంలో ఎటువంటి అభ్యంతరం లేదన్నారు.

ప్రశాంతంగా పండుగను జరుపుకోవాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ బాబురావు

రేగొండ : మండలంలో బతుకమ్మ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా ప్లానింగ్ అధికారి దేవినేని బాబురావు అన్నారు. బుధవారం స్థానిక వేణుగోపాలస్వామి గుడి ఆవరణలో జరుగుతున్న ఏర్పాట్లతో పాటు పలు గ్రామాల్లోని ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మ ఆడుకునే, నిమజ్జనం చేసే ప్రాంతాల్లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. అధికారికంగా డీజేలు ఏర్పాటు చేయడం లేదని తెలిపారు. ఎవరైనా గ్రామస్తులు డీజే సౌండ్స్ ఏర్పాటు చేయాలనుకుంటే పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు తుల్జా రాణి, కుమారస్వామి, సిబ్బంది రమేష్, మొగిలి, చిరంజీవి ఉన్నారు.

రాష్ట్రకార్యవర్గంలో పలువురికి చోటు

కాటారం: హైదరాబాద్‌లో జరిగిన పీఆర్టీయూ రాష్ట్ర 35వ కౌన్సిల్ కార్యవర్గంలో మహాముత్తారం నుంచి పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో పలువురు ఉపాధ్యాయులకు చోటు దక్కింది. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా కామిడి సతీష్‌రెడ్డి (జెడ్పీహెచ్ఎస్, ములుగుపల్లి) కృష్ణమోహన్ (ఉన్నత పాఠశాల, కొర్లకుంట), సంతోష్‌బాబు (మీనాజీపేట ప్రాథమిక పాఠశాల), రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కదారి జయమధుకర్ (మహాముత్తారం జెడ్పీహెచ్ఎస్), సాంబయ్య (ఉన్నత పాఠశాల, బొర్లగూడెం) ఎన్నికయ్యారు. తమ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డిలకు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రేగురి సుభాకర్‌రెడ్డి, కుసునపు కిరణ్‌కుమార్, మండల అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు భూక్య రవి నాయక్, అజ్మీరా రవీందర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు



గణపురం : గుడుంబాను పట్టుకున్న పోలీసులు



కాటారం : చెక్కర పానకం పారబోస్తున్న పోలీసులు



పట్టుకున్న గుడుంబాను చూపిస్తున్న పోలీసులు

గణపురం : మండలంలోని బస్వరాజుపల్లిలో ఎక్సైజ్, స్థానిక పోలీసులు గుడుంబా స్థావరాలపై మూకుమ్మడి దాడి చేసి 20 లీటర్ల నాటుసారాతో పాటు 500 లీటర్ల గుడుంబా తయారీ పానకాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్, గణపురం ఎస్సైలు లింగంగౌడ్, ఆర్.అశోక్‌లు తెలిపారు. దాడుల్లో బస్వరాజుపల్లికి చెందిన బానోతు లక్ష్మీ వద్ద 10 లీటర్ల గుడుంబా, గుగులోతు వసంత దగ్గర 10 లీటర్ల గుడుంబాను పట్టుకోవడంతో పాటు 500 లీటర్ల బెల్లంపానకాన్ని పట్టుకొని సీజ్ చేసి ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గుడుంబా తయారీకోసం నిల్వ ఉంచిన 500 లీటర్ల పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా గుడుంబా తయారీచేస్తే తమకు వెంటనే సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

కాటారం : స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం. లింగాచారి ఆధ్వర్యంలో ఏకకాలంలో పలిమేలా, సర్వాయిపేట, సూరారం, పంకేనా, నిమ్మగూడెం, పెగడపల్లి, గంగారాం, గంట్ల కుంట, కాళేశ్వరం, కన్నెపల్లి గ్రామాల్లోని గుడుంబా స్థావరాపై ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. 56 లీటర్ల నాటుసారా, 30 కిలోల చెక్కర స్వాధీనం చేసుకొని, 850 లీటర్ల చెక్కర పానకంను ధ్వంసం చేశారు. 8 కేసులు నమోదు చేసి ఏడుగురుని అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ సీఐ రాజసమ్మయ్య, ఎస్సైలు కిష్టయ్య, తమాషా రెడ్డి, చక్రపాణి, మహేందర్, పవన్, పాల్గొన్నారు.

టేకుమట్ల: నిషేధిత మత్తు పదార్థమైన గుడుంబాను వెలిశాలలో బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై గోగికారి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వివరాలను వెల్లడించారు. మండలంలోని వెలిశాలలో అందె లక్ష్మీ, అందె నర్సమ్మలు అక్రమంగా గుడుంబాను విక్రయిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఒక్కొక్కరి వద్ద ఐదు లీటర్ల గుడంబాను స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఏఎస్సై ఇంతియాజ్, హెడ్‌కానిస్టేబుల్ రమేష్,పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

రేగొండ: మండలంలోని రామన్నగూడెం తండాలో గుండుబా తయారీ స్థావరాలపై ఎస్సై సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన రుక్మిణీ, కైక గుడుంబా తయారు చేసి, విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. 10 లీటర్ల గుడంబా, 100 లీటర్ల సారా తయారీకి ఉపయోగించే బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. దాడుల్లో ప్రొబిషనరీ ఎస్సైలు దివ్య, హేమలత, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

సూరారంలో గుడుంబా పట్టివేత



సూరారంలో గుడుంబా పట్టుకున్న పోలీసులు

కాళేశ్వరం: మహాదేవపూర్ మండలంలోని సూరారంలో పోలీస్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. బుధవారం తనిఖీల్లో సూరారంలో గ్రామానికి చెందిన సంతోషపు మాయ ఇంటి వద్ద 10 లీటర్లు, మహదేవపూర్‌లో కొక్కు అశోక్ 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న పీడీఎస్ బియ్య ట్రాలీ

భూపాలపల్లి అర్బన్ : మండలంలోని కొంపల్లి క్రాస్ వద్ద పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు స్థానిక ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బుధవారం కొంపల్లి క్రాస్‌వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ట్రాలీ వాహనంలో పీడీఎస్ బియ్యంతో అనుమానాస్పదంగా వెళ్తున్న వ్యక్తి కనిపించగా అదుపులోకి తీసుకోని విచారించినట్లు తెలిపారు. గణపురం మండలం చెల్పూర్ గ్రామానికి చెందిన కొండపల్లి సురేష్‌గా ఒప్పుకోవడం జరిగిందన్నారు. గత కొంత కాలంగా పీడీఎస్ బియ్యం వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. కొంపల్లిలో 35 క్వింటాళ్ల బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు తెలిపారు. పెద్దాపూర్ గ్రామానికి చెందిన ముంజాల రాకేష్‌తో కలిసి బియ్యం వ్యాపారం చేస్తున్నట్లు వివరించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వీఓఏలకు చీరల పంపిణీ



చీరలు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్ అంకిత్ వర్మ

చిట్యాల: స్థానిక యూనియన్ బ్యాంక్ పరిధిలోని గ్రామైఖ్య సంఘాల వీఓఏలకు బ్యాంకు మేనేజర్ అంకిత్‌వర్మ బుధవారం చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో మహిళా సభ్యులకు బ్యాంకు లోన్లు ఇప్పించి ప్రతి నెల వాయిదా బకాయిలను చెల్లించి ప్రభుత్వ రాయితీ వడ్డీలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం మంజుల, ఆర్టీఓ జగదీష్ , సీసీలు లలిత, రమణాదేవి, వీఓఏలు పాల్గొన్నారు.

పరామర్శ



చిట్యాల : బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన బుర్ర మహేష్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతని కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్‌లు పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. వారి వెంట నాయకులు పిట్ట సురేష్ , కట్కూరి రాజేందర్, రాకేష్ ఉన్నారు.

కాన్షీరాం ఆశయ సాధనకు పోరాడాలి

వెంకటాపురం(కె) : బహుజన సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం ఆశయ సాధనకు బహుజనులు పోరాడాలని మాదిగ జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు యాసం రమేశ్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో బుధవారం కాన్షీరాం 18వ వర్ధంతిని మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ కాన్షీరాం ఆశయాలు సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కొడారి వినాయకరావు, చెన్నం గోపి, వంకాయల వెంకటేశ్వర్లు, చిట్యాల చక్రి, చిట్యాల సాగర్, చెన్నం నరేష్, గౌతమ్, తిప్పనపల్లి రాంబాబు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో భక్తుల పూజలు



చిట్యాల : పూజలో పాల్గొన్న భక్తులు



పూజలో పాల్గొన్న ఎస్సై ప్రసాద్

చిట్యాల : మండలంలోని గోపాలపూర్‌లోని పోచమ్మవాడ యూత్ ఆధ్వర్యంలో దుర్గామాత పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి సేవలో ప్రత్యేక పూజలు నిర్వహించి దుర్గామాత ఆశీస్సులు పొందారు. అనంతరం గ్రామంలో మహాన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు పాల్గొన్నారు.

సరస్వతీ అవతారంలో దుర్గామాత

మొగుళ్లపల్లి : మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో కొలువుదీరిన దుర్గామాత ఏడో రోజు బుధవారం సరస్వతీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివరామకృష్ణ భజనమండలి సభ్యుల సేవా సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో సభ్యులు, వేణవంక నవీన్, ప్రసాద్, భజనమండలి సభ్యులు అన్నారెడ్డి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో అన్నదానం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో అమ్మ భవాని కమిటీ ఆధ్వర్యంలో దేవీశరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గ భవాని అమ్మవారి వద్ద ఏడో రోజు బుధవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహదేవపూర్ విశ్రాంత ఉద్యోగి గుజ్జేటి రాజవీరు, అతని కుమారుడు శ్రీనివాస్ భక్తులకు అన్న ప్రసాదం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మమత, కమిటీ సభ్యులు నాగరాజు, సంతోష్, శ్రీకాంత్, హన్మంత్, సాయి, రాకేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలో ఎస్సై

టేకుమట్ల: మండలంలోని ఆశిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన దేవి నవరాత్రుల ఉత్సవాల భాగంగా బుధవారం ఎస్సై గొవికారి ప్రసాద్ హాజరై మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల గోదాం తనిఖీ



గోదాంను తనిఖీ చేస్తున్న ఏడీఏ

కాటారం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల గోదాంను ఏడీఏ శ్రీపాల్ బుధవారం తనిఖీ చేశారు. యూరియా అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఇటీవల కలెక్టర్‌కు మండల కేంద్రానికి చెందిన వ్యక్తి ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. దీంతో ఏడీఏ విచారణ చేపట్టారు. రైతులు, పీఏసీఎస్ సిబ్బందిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోదాంలో నిలువ ఉన్న ఎరువులు, విక్రయాలు తదితర వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.